---

# నిత్యాత్ముడై యుండి నిత్యుడై వెలుగొందు

ప: నిత్యాత్ముడై యుండి నిత్యుడై వెలుగొందు సత్యాత్ముడై యుండి సత్యమై తానుండు

ప్రత్యక్షమై యుండి బ్రహ్మమై యుండు సం- స్తుత్యుడీ తిరువేంకటాద్రివిభుడు

చ : ఏమూర్తి లోకంబులెల్ల నేలెడునాత- డేమూర్తి బ్రహ్మాదులెల్ల వెదకెడునాత- డేమూర్తి

నిజమోక్షమియ్య జాలెడునాత- డేమూర్తి లోకైకహితుడు యేమూర్తి నిజమూర్తి

యేమూర్తియును గాడు యేమూర్తి త్రైమూర్తు లేకమైనయాత- డేమూర్తి సర్వాత్మ డేమూర్తి

పరమాత్మ- డామూర్తి తిరువేంకటాద్రివిభుడు

చ : యేదేవుదేహమున నిన్నియును జన్మించె నేదేవుదేహమున నిన్నియును నణగె

మరి యేదేవు విగ్రహంబీసకల మింతయును యేదేవునేత్రంబు లినచంద్రులు

యేదేవు డీజీవులిన్నింటిలో నుండు నేదేవుచైతన్య మిన్నిటికి నాధార- మేదేవు డవ్యక్తు

డేదేవు డద్వంద్వుడు- డాదేవుడీ వేంకటాద్రివిభుడు

చ : యేవేల్పుపాదయుగ మిలయునాకాశంబు యేవేల్పుపాదకేశాంతం బనంతంబు

యేవేల్పునిశ్వాస మీమహామారుతము యేవేల్పునిజదాసు లీపుణ్యులు యేవేల్పు సర్వేశు

డేవేల్పు పరమేశు- డేవేల్పు భువనైకహితమనోభావకుడు యేవేల్పు కడుసూక్ష్మ మేవేల్పు

కడుఘనము ఆవేల్పు తిరువేంకటాద్రివిభుడు



Contributed By: Somayajulu Sistla

www.telugulyrics.org